క్లుప్తంగా

జీఎస్టీ తగ్గింపుతో వ్యాపారులకు మేలు



నెహ్రూనగర్: జీఎస్టీ తగ్గింపు నిర్ణయం వల్ల వ్యాపారులతో పాటు వినియోగదారులకు ఎంతో మేలు జరుగుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. అదనపు కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి శనివారం పాత గుంటూరులోని పలు దుకాణాలను సందర్శించారు. జీఎస్టీ తగ్గింపుపై వివరాలు అడిగారు. ప్రజలకు తగ్గింపుతోనే విక్రయాలు చేయాలని వ్యాపారులకు సూచించారు. అధిక ధర వసూలు చేయడానికి వీల్లేదని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించని షాపులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వార్డుల వారీగా ప్రజలకు తగ్గిన జీఎస్టీపై కరపత్రాల ద్వారా అవగాహన కలిగిస్తున్నామని కమిషనర్ తెలిపారు.

గుంటూరు వైద్యుడికి ప్రశంసా పత్రాలు



గుంటూరు మెడికల్: స్థానిక మెడికల్ కాలేజ్ కమ్యూనిటీ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిల్‌కుమార్‌కు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నరసింహం, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి కృష్ణబాబులు ప్రశంసా పత్రాలు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా క్యాన్సర్ నివారణ కార్యక్రమం ప్రారంభించడంలో కీలక పాత్ర పోషించడంతో పాటు, ప్రధాన వ్యాధుల భారం తగ్గించడానికి, రేడియేషన్ ఆంకాలజీ రంగంలో చేసిన విశిష్ట కృషికి డాక్టర్ అనిల్‌కుమార్‌కు ప్రశంసా పత్రాలు ఇచ్చి అభినందించారు. శనివారం గుంటూరు వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారీ డాక్టర్ అనిల్‌కుమార్‌ను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ మాధవి, కమ్యూనిటీ మెడిసిన్ ఇన్‌చార్జ్ హెచ్‌ఓడీ డాక్టర్ పూర్ణమ్మ, బోధనా సిబ్బంది, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాక్సిన్‌తో రేబిస్ నుంచి రక్షణ

- కుక్కకాటుతో సోకనున్న ప్రాణాంతక వ్యాధి
- వ్యాక్సిన్‌తో సురక్షితం
- అశ్రద్ధ చేయకుండా చేయించుకోవాలి
- నేడు వరల్డ్ రేబిస్ డే


గుంటూరు మెడికల్: కుక్కకాటు ద్వారా సంభవించే రేబిస్ వ్యాధి అనేక మంది ప్రాణాలు బలికొంటోంది. 2011లో ఉభయ తెలుగు రాష్ట్రాలను వణికించేసింది. జిల్లాలోని కాకుమానులో ఆరేళ్ల చిన్నారి కౌసర్ 2016లో, 2017లో గుంటూరు రూరల్ మండలం అడవితక్కెళ్లపాడులో నాలుగేళ్ల ధూపాటి ప్రేమ్‌కుమార్ కుక్కల దాడిలో మృతి చెందాడు. పిల్లలే కాకుండా పెద్దవారు సైతం కుక్కకాటు బారిన పడి మరణిస్తున్నారు. ఏటా జిల్లాల్లో కుక్కకాటు ద్వారా 10 మందికి పైగా మరణిస్తున్నారు. కరచిన ప్రతి కుక్కలోనూ రేబిస్ వైరస్ ఉండదు. కాని ఉన్న కుక్క ఏదో తెలియదు కాబట్టి అశ్రద్ధ చేయకుండా వెంటనే జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. కుక్కకాటు వల్ల వచ్చే రేబిస్ అనర్థాలపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది సెప్టెంబర్ 28న 'వరల్డ్ రేబిస్ డే' నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

వ్యాధి లక్షణాలు

రేబిస్ వ్యాధి సోకిన కుక్క నాలుక బయటకు చాపి,చొంగ కారుస్తూ మతిస్థిమితం లేకుండా తిరుగుతుంది. యజమానిని సైతం గుర్తించలేదు. కన్పించిన ప్రతి వస్తువును కరిచేందుకు ప్రయత్నిస్తుంది. నడిచేటప్పుడు తడబడుతూ, తూలుతూ తోకను ఆడించలేని స్థితిలో ఉంటుంది. అరుపులో మార్పు వస్తుంది. నీటిని కూడా తాగలేని స్థితిలో అంటుడొక్కలు పడి ఊపిరి పీల్చుకోలేక ఐదు నుంచి ఏడు రోజుల్లో మరణిస్తుంది.

మనుషుల్లో లక్షణాలు

మనుషులు వ్యాధికి గురైనప్పుడు దవడ, గొంతు కండరాలకు పక్షవాతం వచ్చి, ఎంత దాహం వేసినా నీటిని తాగలేరు. ఎక్కువ సందర్భాల్లో రోగి నీటిని చూసినా, నీటి శబ్దం విన్నా భయపడతాడు. ఈ లక్షణాన్ని హైడ్రోఫోబియా అని పిలుస్తారు. ఇలాంటి స్థితిలో మతిస్థిమితం కోల్పోయి, ఊపిరి పీల్చుకోలేక మనుషులు కూడా మరణిస్తారు.



రేబిస్ డే పోస్టర్

జీజీహెచ్‌లో చికిత్స పొందిన బాధితులు

సంవత్సరం	బాధితుల సంఖ్య
2023	34,931
2024	38,342
2025లో	28,942

వ్యాధి సోకి చనిపోయిన వారు

2021	13
2022	9
2023	18
2024	13



కుక్కకు వ్యాక్సిన్



జీజీహెచ్‌లో వ్యాక్సిన్‌లు చేయించుకుంటున్న కుక్కకాటు బాధితులు (ఫైల్)

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా వ్యాక్సిన్లు



గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రితోపాటుగా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సైతం ఉచితంగా కుక్కకాటు బాధితులకు ర్యాబీపూర్ వ్యాక్సిన్లు చేస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో ప్రతి రోజూ 60 నుంచి 70 మంది దాకా వ్యాక్సిన్ చేయించుకుంటున్నారు. అవుట్ పేషెంట్ విభాగంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉచితంగా వ్యాక్సిన్‌ను చేస్తున్నారు. అత్యవసర విభాగంలో అన్ని వేళలా అందుబాటులో ఉంటుంది. కుక్క కరిచిన వెంటనే, మూడో రోజు, ఏడవ రోజు, 28వ రోజు మొత్తం నాలుగు సార్లు ర్యాబీపూర్ ఇంజెక్షన్లు చేయించాలి. – డాక్టర్ యశ్వి రమణ, సూపరింటెండెంట్, గుంటూరు జీజీహెచ్

వెంటనే వైద్యులను సంప్రదించాలి



పిచ్చికుక్క కరిచిన వెంటనే గాయాన్ని చల్లటి నీటితో, సబ్బుతో కడగాలి. నీరు ధారగా పడే విధంగా చేయాలి. గాయంపై టింక్చర్ అయోడిన్ వేయాలి. కుట్లు వేయడం, ఆయింట్‌మెంట్ పూయడం, నిప్పుపెట్టి కాల్చడం, కోయడం వంటివి చేయకూడదు. కుక్క కరిచిన వెంటనే సాధ్యమైనంత మేరకు త్వరగా వైద్యులను సంప్రదించి టీకాలు వేయించుకోవడం ద్వారా వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చు. పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలి. – డాక్టర్ నరేంద్ర వెంకటరమణ, సీనియర్ ఫిజీషియన్, గుంటూరు

సందడిగా వరల్డ్ హార్ట్ డే వాకథాన్



మాట్లాడుతున్న హీరోయిన్ శివాని, పక్కన కిమ్స్ శిఖర హాస్పిటల్స్ వైద్యులు

గుంటూరు మెడికల్: వరల్డ్ హార్ట్ డే సందర్భంగా శనివారం స్థానిక మంగళగిరి రోడ్డులోని కిమ్స్ శిఖర హాస్పిటల్స్ ఆధ్వర్యంలో వాకథాన్ సందడిగా సాగింది. లిటిల్ హార్ట్స్‌సినిమా హీరోయిన్ శివాని ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. హృదయ ఆకారంలో ఉన్న బెలూన్లు ఎగురవేసి వాక్‌థాన్‌లో నడిచి నగర ప్రజలను అలరించారు. మంగళదాస్‌నగర్‌లోని హాస్పిటల్ నుంచి గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ వరకు వాక్‌థాన్ జరిగింది. ఈ సందర్భంగా సినీనటి శివాని మాట్లాడుతూ యువత ఎల్లప్పుడు సంతోషంగా ఉండాలంటే ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోవాలని చెప్పారు. చక్కని ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ మంచి ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. కిమ్స్ శిఖర హాస్పిటల్స్ కార్డియాక్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ పర్వతనేని నాగశ్రీహరిత మాట్లాడుతూ ఒత్తిడితో కూడిన జీవనశైలితో గుండె వ్యాధులు వృద్ధులకే కాదు యువతలో కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. స్కానింగ్, పరీక్షలతో ముందుగానే ప్రమాద సూచికలను గుర్తించవచ్చని చెప్పారు. యోగా, ధ్యానం చేయడం వల్ల ఒత్తిడి తగ్గి, గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎ. శివప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలితో పాటు రెగ్యులర్ హెల్త్ చెకప్‌తో గుండె జబ్బులను రాకుండా అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ శ్రీనివాస్‌బాబు, కిమ్స్ హాస్పిటల్స్ యూనిట్ హెడ్ డాక్టర్ హరికుమార్ , డైరక్టర్స్ న్యూరోసర్జన్ డాక్టర్ చిట్టెం లక్ష్మణరావు, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కొల్లి జయకిషన్ పాల్గొన్నారు.

విజయవంతంగా 101 బ్రాకీ థెరఫీ చికిత్సలు



గుంటూరు మెడికల్: స్థానిక ఆర్కా క్యాన్సర్ హాస్పిటల్‌లో 77 రోజుల్లో 101 బ్రాకీ థెరఫీ చికిత్సలు విజయవంతంగా చేశామని సీనియర్ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ దేవనబోయిన శౌరిరాజునాయుడు తెలిపారు. మంగళగిరి రోడ్డులోని హాస్పిటల్‌లో శనివారం బ్రాకీ థెరఫీ చికిత్సలు విజయవంతంగా నిర్వహించడంలో ప్రధాన పాత్ర పోషించిన నర్సింగ్ స్టాఫ్ రత్నకుమారిని వైద్యులు సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజునాయుడు మాట్లాడుతూ బ్రాకీ థెరఫీ చికిత్సలో వ్యాధి సోకిన అవయవాన్ని తొలగించకుండానే నయం చేయడం సాధ్యమవుతుందని వివరించారు. క్యాన్సర్ రోగులకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా సేవలు అందించామని తెలిపారు. కార్యక్రమంలో క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ పవన్ రాఘవరెడ్డి, డాక్టర్ హేమంత్ మాకినేని, డాక్టర్ హిమాని మంచాల పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఎమ్మార్పీఎస్ నేతల ఆందోళన

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో శనివారం ఎమ్మార్పీఎస్ నేతలు ఆందోళన చేశారు. ఆసుపత్రిలో కాంట్రాక్టు ఈసీజీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న నాగరాజును ఉద్యోగం నుంచి తొలగించిన విధానం సరైనది కాదని, తిరిగి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వి రమణ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ జరిగిందని, నివేదికను ఆయనకు అందజేశామని తెలిపారు. తిరిగి విచారణ కమిటీ నియమించాలని కలెక్టర్‌ను కోరతామని, లిఖిత పూర్వకంగా డిమాండ్లను ఇవ్వాలని సూచించారు.



ఆర్.అగ్రహారం శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో గజలక్ష్మీదేవిగా..



లాలాపేట శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీసంతానలక్ష్మీదేవి



ఏటుకూర్ రోడ్ శ్రీకన్యకా పరమేశ్వరి ఎన్‌క్లేవ్‌లో లలిత త్రిపురసుందరీదేవి

నానా అలంకార భూషితే.. నమస్తుతే !

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం నగర పరిధిలోని దేవాలయాల్లో అమ్మవారు పలు అవతారాల్లో దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం కుంకుమార్చన, లోక కల్యాణార్థం శక్తి హోమాలు నిర్వహించారు. పలువురు దంపతులు అమ్మవారి సహస్రనామ పూజలు చేపట్టారు. విశేష హారతి, మంత్రపుష్పం అనంతరం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. – నగరంపాలెం



ఆర్.అగ్రహారం శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రీదుర్గాదేవి



కొత్తపేట శ్రీజగన్నాథస్వామి దేవస్థానంలో శ్రీమహాలక్ష్మీదేవి

నాణ్యమైన సేవలు అందించాలి



గుంటూరు మెడికల్: కష్టమర్లకు నాణ్యమైన జుట్టు, చర్మ సంరక్షణ సేవలు అందించాలని డెప్యూటీ మేయర్ షేక్ సజీల కోరారు. జుట్టు పెరుగుదల, చర్మ పునరుజ్జీవనంలో అగ్రగామిగా ఉన్న అడ్వాన్స్‌డ్ గ్రోహెయిర్ – గ్లోస్కిన్ క్లినిక్‌ను శనివారం గుంటూరులోని లక్ష్మీపురం మెయిన్ రోడ్డులో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక హెయిర్, స్కిన్‌కేర్ సొల్యూషన్స్‌ను గుంటూరుకు తీసుకురావడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ శరణ్ వెల్‌జే మాట్లాడుతూ భారతదేశంలో 105వ బ్రాంచ్‌ను గుంటూరులో ప్రారంభించడం ఆనందంగా ఉందని తెలిపారు. ఫ్రాంచైజీ పార్టనర్ భార్గవి గంజి మాట్లాడుతూ అత్యుత్తమ సేవల ద్వారా కష్టమర్ల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలన్న లక్ష్యంతో ఉన్నామని తెలిపారు.

● కాఫీ అవుట్‌లెట్ల ఏర్పాటుకు రుణాల మంజూరు

నెహ్రూనగర్: అరకు కాఫీ అవుట్‌లెట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ రుణాలు అందిస్తోందని డీఆర్‌డీఏ పీడీ టి.వి.విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం ఆసక్తి గల లబ్ధిదారులతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, రద్దీ ప్రదేశాల్లో అరకు కాఫీ అవుట్‌లెట్లు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌డీపీఎం డాక్టర్ టి.అశోక్‌కుమార్, నెటీప్ అరకు కాఫీ సీఈఓ రామ్‌కుమార్ వర్మ పాల్గొన్నారు.

● జీఎస్టీపై బీజేపీ నేతల 'మాటా మంతి

గుంటూరు మెడికల్: జీఎస్టీ 2.0 విధానం వల్ల కలిగే ప్రయోజనాలపై బీజేపీ నేతలు గుంటూరులో శనివారం మాటా మంతి కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ నగరంలోని వ్యాపారస్తులతో మాట్లాడారు. నూతన జీఎస్టీ విధానం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ జీఎస్టీ 2.0 విధానం వల్ల ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్, వస్త్ర, నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులకు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శులు బజరంగ్ రామకృష్ణ, దేసు సత్యనారాయణ, తోట శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు మంత్రి సుగుణ పాల్గొన్నారు.